సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం : 1 : ఏప్రిల్ : 2025



సోమశిలలో 53.374 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారానికి 53.374 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువన వివిధ కాలువలకు 1080 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.93,380
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,450
3 శాతం జీఎస్టీతో	రూ.8,704
నవర (8 గ్రా)	రూ.69,632

గరిష్టం/కనిష్టం 34.6 /25.0

వాతావరణం

జిల్లాలో మంగళవారం వాతావరణం పొడిగా ఉంటుందని ఆశాఖాధికారులు తెలిపారు. గాలిలో తేమ 61 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

సోమశిల ప్రాజెక్ట్ నాల్గో డివిజన్ ఈఈగా బాధ్యతలు



సోమశిల ప్రాజెక్ట్ నాల్గో డివిజన్ ఈఈగా బాధ్యతలు స్వీకరిస్తున్న సీసీ రాజశేఖరరెడ్డి

ఆత్మకూరురూరల్: సోమశిల ప్రాజెక్ట్ నాల్గో డివిజన్ ఈఈగా సీసీ రాజశేఖర్ రెడ్డి సోమవారం ఆత్మకూరులోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈఈగా పనిచేసిన మిరియాల వెంకటరమణారెడ్డి ఉద్యోగ విరమణ చేసిన నేపథ్యంలో నూతన ఈఈగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారులు, సిబ్బంది నూతన ఈఈని అభినందించారు. కార్యక్రమంలో డీఈ మెట్టుకూరు మురళీకృష్ణారెడ్డి, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పది సోషల్ పరీక్ష

నెల్లూరు (టౌన్): వాయిదా పడిన పదో తరగతి సోషల్ స్టడీస్ పరీక్ష మంగళవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరగనున్నట్లు డీఈఓ ఆర్.బాలాజీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు గమనించాలన్నారు.

119 క్రయవిక్రయ రిజిస్ట్రేషన్లు

నెల్లూరు సిటీ: జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోమవారం 119 క్రయవిక్రయ రిజిస్ట్రేషన్లు జరిగాయని జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు తెలిపారు. ప్రభుత్వానికి రూ.42.30 లక్షలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

పింఛన్ల పంపిణీ నేడు

నెల్లూరు (పొగతోట): జిల్లాలో మంగళవారం సామాజిక భద్రత పింఛన్ల పంపిణీకి అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లా వ్యాప్తంగా 3,06,517 మంది లబ్ధిదారులకు రూ.132 కోట్ల మేర నగదు పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది ద్వారా అందజేయనున్నారు.

నేటి నుంచి జూనియర్ కళాశాలలు పునః ప్రారంభం

- ఈ నెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు వేసవి సెలవులు

నెల్లూరు (టౌన్): ఇంటర్ పరీక్షల అనంతరం జూనియర్ కళాశాలలను మంగళవారం నుంచి పునః ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. జిల్లా వ్యాప్తంగా 186 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో 51 ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కళాశాలలు ఉండగా మిగిలిన 135 ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలల్లో రెండు సంవత్సరాలు కలిపి 59 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. అయితే ఈ నెల 1వ తేదీనుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు, 7వ తేదీ నుంచి ప్రథమ సంవత్సర విద్యార్థులకు తరగతులు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమయంలో కేవలం బ్రిడ్జి కోర్సులు మాత్రమే చెప్పాలని ఆదేశించారు. ఈ నెల 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించారు. వేసవి సెలవుల అనంతరం జూన్ 2వ తేదీ నుంచి కళాశాలలను పునః ప్రారంభించాలని నిర్ణయించారు.

చల్లంచర్ల వాసికి కళారత్న అవార్డు



అవార్డును అందుకుంటున్న అంకయ్య

కావలి: విశ్వావసు ఉగాది పండగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన ఉగాది పురస్కారాల్లో కావలి మండలం చల్లంచర్లకు దానం అంకయ్యకు హంస అవార్డు, కళారత్న బిరుదు, రూ.50 వేల పారితోషికం దక్కింది. సీఎం చంద్రబాబు, రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, కందుల దుర్గేష్ చేతుల మీదుగా అంకయ్య అవార్డు అందుకున్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద శక్తి వీరగాథ అంకమ్మ కథ చెప్పగలిగిన ఏకైక వ్యక్తి ఆయన. రోజుకు 3 గంటల చొప్పున 18 రాత్రులు మొత్తం 54 గంటలు సాగే ఈ కథను దాదాపు 70 సంవత్సరాల నుండి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లో దాదాపు 15 వేల ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కథాగానానికి 'తెలుగు నెరవు' సంస్థ అక్షర రూపం ఇచ్చి, ఈ కథాగానాన్ని వీడియో రికార్డు చేశారు.

దగా.. దగా..

బోగస్ కొనుగోలు కేంద్రాలు



జిల్లాలో ధాన్యం క్రయవిక్రయాల్లో రైతులు దగా పడుతున్నారు. అధికార యంత్రాంగం రైతులను ఏ విధంగా మోసం చేస్తుందో ఐఏబీ నీటి కేటాయింపు నుంచి ధాన్యం కొనుగోలు లక్ష్యం వరకు లెక్కలే తేటతెల్లం చేస్తున్నాయి. పంట సాగుకు, దిగుబడికి మధ్య తేడాలు చూస్తుంటే అధికార యంత్రాంగం బోగస్ బొక్కలు కనిపిస్తున్నాయి. పేరుకే ధాన్యం కొనుగోలు కేంద్రాలు. ఇక్కడ రైతుల పేరుతో దళారులు, మిల్లర్లు నమోదు చేసుకుంటూ రైతులను నిలువునా దోచుకుంటున్నారు. ఎంత ధాన్యం పండితే అంత కొనుగోలు చేస్తామంటూ ఆర్భాటంగా ప్రకటనలు చేస్తున్న అధికార యంత్రాంగం పీపీసీల ద్వారా రోజుకు ఇంత ధాన్యమే కొనాలని టార్గెట్లు విధించారు. ఏ రోజుకు ఆ రోజు కొనుగోలు రిలీజ్ ఆర్డర్లు ఇస్తున్నారు. స్టేట్ నుంచి జిల్లాకు కేటాయించే రిలీజ్ ఆర్డర్లను బట్టే పీపీసీలకు రిలీజ్ ఆర్డర్లు ఇస్తున్న పరిస్థితితో రైతు దగాకు గురవుతున్నారు. ఈ రిలీజ్ ఆర్డర్ వస్తేనే ట్రక్ షీట్ ఇచ్చే పరిస్థితి పీపీసీల్లో నెలకొంది.

- పీపీసీలకు ఏ రోజుకు ఆ రోజే టార్గెట్ రిలీజ్
- రోజుకు 2 వేల బస్తాలకు మించి కొనొద్దని ఆదేశాలు
- అమరావతి నుంచి ఇచ్చే రిలీజ్ ఆర్డర్‌ను బట్టే పీపీసీలకు కేటాయింపు
- ఒక్కో రోజు పీపీసీకి వెయ్యి బస్తాలు కూడా అనుమతివ్వని వైనం
- ట్రక్ షీట్ ఇవ్వాలంటే సివిల్ సప్లయీస్ శాఖ నుంచి రిలీజ్ ఆర్డర్ వస్తేనే..
- పీపీసీల్లో అమ్ముకున్నా.. అమలు కాని మద్దతు ధర

నెల్లూరు (పొగతోట): జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ చూస్తుంటే.. 'ఠాగూరు' సినిమాలో డెడ్ బాడీకి ట్రీట్‌మెంట్ ఇస్తున్నట్లు సీరియస్‌నెస్ క్రియేట్ 'సీన్' గుర్తుకు వస్తోంది. పండించిన ప్రతి గింజ ధాన్యం కొనుగోలు కేంద్రాల కొనుగోలు చేస్తామంటూ అధికార యంత్రాంగం ఆర్భాటంగా ప్రచారం చేస్తూ.. అదే రీతిలో హడావుడి చేస్తోంది. ప్రతి రోజూ ఇంత కొన్నాం.. అంత కొన్నాం అంటూ ప్రకటిస్తూ రైతాంగాన్ని గింజ.. గింజలో మోసం చేస్తున్నారు. మరో వైపు ఏ రోజుకు ఆ రోజు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు టార్గెట్లు విధించి, అంతకు మించి కొనుగోలు చేయొద్దంటూ ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఆన్‌లైన్‌లోనే ట్రక్ షీట్లు రిలీజ్ కాకుండా బ్లాక్ చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నూతన నిబంధనలను అమలు చేసి రైతులను మోసగిస్తోంది.

పీపీసీ ద్వారా రోజుకు 2 వేల బస్తాలే కొనాలి

జిల్లాలో ప్రతి రైతు పండించిన పంటను కొనుగోలు కేంద్రాల ద్వారానే కొంటామని 300 పీపీసీ (ధాన్యం కొనుగోలు కేంద్రాలు)లు అధికారులు ఏర్పాటు చేశారు. అయితే ఒక్కొక్క పీపీసీకి రోజుకు 2 వేల బస్తాలే కొనాలని కటాఫ్ విధించింది. 40 కేజీల బస్తాలు 2 వేలంటే.. 80 మెట్రిక్ టన్నులే కొనాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ అమరావతి నుంచి జిల్లాకు ఇచ్చే టార్గెట్‌ను బట్టి పీపీసీలకు టార్గెట్ రిలీజ్ చేస్తున్నారు. ఈ లెక్కన ఒక్కొక్క పీపీసీకి వెయ్యి బస్తాలు కూడా కేటాయింపు జరగడం లేదనేది అసలు నిజం. మరుసటి రోజు టార్గెట్ రిలీజ్ ఆర్డర్ వచ్చేంత వరకు ఆ పీపీసీ ద్వారా ధాన్యం కొనుగోలు చేయడం లేదు. దీంతో రైతులు పీపీసీల చుట్టూ తిరిగి తిరిగి వేసారి తక్కువ ధరలకు దళారులకు ధాన్యాన్ని తెగనమ్ముకుంటున్నారు. ప్రస్తుతం 80 శాతం మేర వరికోతలు పూర్తయ్యాయి. 20 శాతం వరి కోతలు మిగిలి ఉన్నాయి.

రైతుల్ని బకరాలను చేస్తున్న అధికార యంత్రాంగం

జిల్లాలో వ్యవసాయ, రెవెన్యూ, సివిల్ సప్లయీస్ శాఖలు రైతులను ఏ విధంగా బకరాలను చేస్తున్నాయో.. ఈ లెక్కల బొక్కలు చూస్తే అర్థమవుతోంది. రబీ సీజన్ సాగుకు ముందు జిల్లాలో వివిధ నీటి వనరుల కింద 7.70 లక్షల ఎకరాల సాగుకు నీటిని విడుదల చేస్తున్నామని అధికారులు, ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా ప్రకటించారు. ప్రతి ఎకరా పండితే.. ఈ ఏడాది సగటున (3.5 పుట్లు) అంచనా ప్రకారం 23.10 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుంది. అయితే అధికారులు మాత్రం జిల్లాలో కేవలం 11 లక్షల మెట్రిక్ టన్నులే దిగుబడి వస్తున్నట్లు అంచనా వేశామని చెబుతున్నారు. ఏ లెక్కన ఈ లెక్కలు చెబుతున్నారో వాళ్లకే అర్థం కావాలి.

రబీ సీజన్‌కు ఐఏబీ నీటి కేటాయింపు	- 7.70 లక్షల ఎకరాలు
ప్రతి ఎకరాకు సగటు దిగుబడి	- 3.5 పుట్లు (3 మెట్రిక్ టన్నులు)
జిల్లాలో సగటున వచ్చే దిగుబడి	- 23.10 లక్షల మెట్రిక్ టన్నులు
అధికారులు వేసిన దిగుబడి అంచనా	- 11 లక్షల మెట్రిక్ టన్నులు
జిల్లాలో పీపీసీల ద్వారా ధాన్యం కొనుగొలు లక్ష్యం	
మొత్తం కొనుగోలు టార్గెట్	- 1.25 లక్షల మెట్రిక్ టన్నులు
ఒక్కొక్క పీపీసీకి కేటాయింపు	- 80 మెట్రిక్ టన్నులు

1.25 లక్షల మెట్రిక్ టన్నులే కొనాలి..

జిల్లాలో ఈ ఏడాది రబీ సీజన్‌లో పండే ధాన్యంలో కేవలం 1.25 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనాలని ప్రభుత్వం నిర్దేశించింది. అంటే ప్రభుత్వానికి రైతులపై ఎంత ప్రేమ ఉందో అర్థమవుతోంది. మిల్లర్లతో మిలాఖత్ అయిన ప్రభుత్వం, అధికార యంత్రాంగం రైతులను అడుగడుగునా దగాకు గురి చేస్తున్నాయి. వాస్తవంగా జిల్లాలో రబీ సీజన్లో 23.10 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తే.. 11 లక్షల మెట్రిక్ టన్నులే దిగుబడి వస్తున్నట్లు అధికారులు చెప్పారు. పోని ఇందులో 10 శాతం కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనడం లేదని స్పష్టమవుతోంది. వాస్తవంగా పండే పంటలో 5 శాతం కూడా కొనాలని ప్రభుత్వానికి లక్ష్యం లేదనేది నిజం.

పీపీసీల్లో మిల్లర్ల ధాన్యమే విక్రయాలు..

జిల్లాలో ఇప్పటి వరకు 74 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు అధికార యంత్రాంగం చెబుతోంది. కానీ ఈ ధాన్యం మొత్తం మిల్లర్లే విక్రయించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బోగోలు మండలానికి చెందిన కొందరు రైతులు గత నెల 19వ తేదీ నుంచి పీపీసీ ద్వారా ధాన్యం విక్రయించుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. వీరిలో ఓ రైతు కుటుంబానికి సంబంధించి 4 వేల బస్తాలు విక్రయించుకోలేక.. ప్రతి రోజూ పీపీసీల చుట్టూ తిరుగుతున్నాడు. ఆ రైతు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అమ్ముకుంటున్నాడంటే పొరపాటే. సాధారణ రకం ధాన్యం (పుట్టి 850 కేజీలు) రూ.19,550, గ్రేడ్ ఏ ధాన్యం పుట్టి రూ.19,720లకు మద్దతు ధరకు కొనుగోలు చేస్తామంటూ ప్రభుత్వం ప్రకటించింది. సదరు రైతు బీపీటీ రకం సాగు చేశాడు. ఆ ధాన్యం మార్కెట్లో పుట్టి రూ.16,800, రూ.17 వేలకు మించి ఏ మిల్లరు, దళారీ కొనడం లేదు. దీంతో పీపీసీ ద్వారా విక్రయించుకుంటే కనీసం మద్దతు ధర లభిస్తుందని ఆశపడితే.. మిల్లర్లు ఆ ధరకు తాము కొనేది లేదంటూ తెగేసి చెప్పారు. కాదంటే.. పీపీసీ ద్వారా సరఫరా చేసినందుకు పుట్టి ఇంకో రూ.500 ఎక్కువగా ఇస్తామని, లేదంటే వద్దంటూ చెప్పడంతో విధి లేక అమ్ముకుంటున్నాడు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు లభించక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు ధాన్యం నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంతో కోసిన ధాన్యాన్ని కోసినట్లు తక్కువ ధరకు రైస్ మిల్లర్లకు, దళారులకు విక్రయిస్తున్నారు. పీపీసీలను ఆశ్రయిస్తే రకరకాల సాకులు చూపడం, టార్గెట్ రాలేదనడంతో నిరాశ చెందుతున్న రైతులు తక్కువ ధరలకే ధాన్యం విక్రయించుకుంటున్న పరిస్థితి. ఇది కాదనలేని నిజం.

పొంతనలేని సమాధానాలు

జిల్లాలో పీపీసీల్లో రోజు వారి కొనుగోలు టార్గెట్లు విధించడంతో ట్రక్ షీట్స్ రిలీజ్ కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సంబంధిత శాఖల అధికారులను వివరణ అడగ్గా, ఇలాంటి టార్గెట్ అంటూ ఏమీ ఇవ్వడం లేదని, అవన్నీ ఒట్టి మాటలే అంటూ కొట్టి పారేస్తున్నారు. మరో వైపు జిల్లాకు రబీ సీజన్‌లో ఇంత కొనాలని, రోజుకు ఇంత కొనాలని అమరావతి నుంచి టార్గెట్ ఇస్తున్నారంటూ చెబుతున్నారు. వాస్తవానికి రైతులు సీఎస్‌డీటీ, సహకార సంఘాలకు సంబంధించి పీపీసీల నిర్వాహకులను రైతులు సంప్రదిస్తే ప్రతి రోజూ టార్గెట్ ఇస్తున్నారని, ఆ టార్గెట్ ఇస్తేనే ధాన్యం కొనుగోలు చేస్తాంటూ చెబుతున్నారు. ఇలా జిల్లా అధికార యంత్రాంగం పూటకో మాట, గంటకో మాట పొంతనలేని సమాధానాలు చెబుతున్నారు.





దగదర్తి సమీపంలో రోడ్డు పక్కన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు, ట్రాక్టర్‌కు ధాన్యం లోడ్ చేస్తున్న రైతులు

ఎమ్మెల్యే కోటంరెడ్డికి ముస్లింల నిరసన సెగ

- వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ వినతి

నెల్లూరు (బృందావనం): వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ సోషియల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్డీపీఐ) ఆధ్వర్యంలో సోమవారం బారాషహీద్‌దర్గా ఈద్గా ప్రాంగణంలో ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు. వక్ఫ్ బిల్లును తిరస్కరించాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ముస్లింల హక్కులను హరిస్తున్న ఈ బిల్లును తక్షణమే వెనక్కు తీసుకోవాలని ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనేందుకు వచ్చిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని ఉక్కిరిబిక్కిరి చేశారు. ముస్లింలకు తాను తోడుగా ఉంటానని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో నెల్లూరురూరల్ అసెంబ్లీ అధ్యక్షుడు సయ్యద్‌ఫాజిల్, సభ్యులు అల్తాఫ్, యాసిన్, రబ్బాని తదితరులు పాల్గొన్నారు. వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ భవిష్యత్తులో ఆందోళన ఉధృతం చేస్తామని ప్రకటించారు.



నెల్లూరురూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఎస్డీపీఐ నాయకులు

విద్యుత్ సిబ్బందిపై సైబర్ నేరగాళ్ల అస్త్రం

- ఏసీబీ డీఎస్పీ అంటూ ఫోన్ చేసి వివరాలు సేకరిస్తున్న వైనం
- హడలిపోతున్న జిల్లా విద్యుత్ శాఖ సిబ్బంది

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సైబర్ నేరగాళ్లు విద్యుత్ సిబ్బందిని టార్గెట్ చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పని చేసే లైన్ ఇన్‌స్పెక్టర్ (ఎల్‌ఐ), లైన్‌మెన్ (ఎల్‌ఎం) స్థాయి ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని వారికి ఫోన్ చేసి తాము ఏసీబీ అధికారులమంటూ దబాయిస్తున్నారు. ఆదాయానికి మించి ఆస్తులున్నాయని మీపై పలు ఫిర్యాదులు వస్తున్నాయని, మీ ఇళ్లపై దాడులు చేసేందుకు సిద్ధంగా ఉన్నామంటూ హెచ్చరిస్తున్నారు. అక్రమంగా సంపాదించిన మొత్తంలో కొంత నగదు పంపిస్తే దాడులు, అరెస్టుల నుంచి తప్పిస్తామని లేదంటే పరిణామాలు తీవ్రస్థాయిలో ఉంటాయని చెబుతున్నారు. ఈ క్రమంలో కావలి డివిజన్ బోగోలు విద్యుత్ సెక్షన్ కార్యాలయ పరిధిలో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మురళీధర్ శర్మకు ఆదివారం రాత్రి 88610 49405 నంబర్ నుంచి ఓ వ్యక్తి ఫోన్ చేసి, తాను ఏసీబీ డీఎస్పీ అని తన పేరు భాస్కర్ అని చెప్పారు. లైన్ ఇన్‌స్పెక్టర్‌గా ఆదాయానికి మించి అధిక ఆస్తులు కూడబెట్టారని, మీ ఆస్తుల వివరాలు ఉన్నాయని, మీ ఆస్తులు మీరే చెప్పండంటూ గదమాయించడంతో మురళీధర్‌శర్మ తనకు ఎలాంటి అక్రమ ఆస్తులు లేవని, తన పేరుతో నెల్లూరు నగరంలో ఒక సొంత ఇల్లు మాత్రమే ఉందని చెప్పడం జరిగింది. ఇంతకీ మీరు ఎందుకు ఫోన్ చేస్తున్నారని ఏసీబీ అధికారుల అయితే ఫోన్ చేయరని అవినీతి ఆరోపణలపై ఫిర్యాదు వస్తే రైడ్ చేస్తారే కానీ ఈ విధంగా ఫోన్ చేసి వివరాలు అడగరని నిలదీయడంతో అవతలి వ్యక్తి ఫోన్ డిస్కనెక్ట్ చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో కావలి డివిజన్‌లో ఏసీబీ అధికారులమని చెప్పి పలువురు విద్యుత్ సిబ్బందిని బెదిరిస్తున్న విషయం, ఇతర సమాచారం కోసం తమ ఉన్నతాధికారులను సంప్రదించాలని చెప్పడం వంటి విషయాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మురళీధర్ శర్మ నిలదీసినట్లు సమాచారం. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు విద్యుత్ సిబ్బంది తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న నాగరాజుకు 15 రోజుల క్రితం ఏసీబీ అధికారినంటూ ఫోన్ చేసి రూ.5 లక్షలు డిమాండ్ చేయడంతో హడలిపోయిన ఎల్‌ఐ నాగరాజు చివరకు రూ.50 వేలకు ఒప్పందం చేసుకుని సదరు నకిలీ ఏసీబీ అధికారికి ఫోన్ పే ద్వారా చెల్లించుకున్నాడు. నెల్లూరు జిల్లాలో కూడా వారం రోజుల నుంచి విద్యుత్‌శాఖ ఉద్యోగులకు ఈ విధంగా ఓ వ్యక్తి తాను ఏసీబీ అధికారినంటూ ఫోన్ చేస్తూ బెదిరిస్తుండడంతో సిబ్బంది హడలిపోతున్నారు.

హైదరాబాద్‌లో కాకాణి బంధువుకు నోటీసులు



పొదలకూరు: మాజీ మంత్రి, నెల్లూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై పోలీస్ వేధింపుల పరంపరా కొనసాగుతూనే ఉంది. పొదలకూరు మండలం తాటిపర్తి పంచాయతీ రుస్తుం మైన్ నుంచి అక్రమంగా వైట్ క్వార్ట్జ్ తరలించారని పొదలకూరు పోలీసులు ఫిబ్రవరి 16న కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటి వరకు 10 మందిని నిందితులుగా చూపి ముగ్గురిని అరెస్ట్ చేశారు. అయితే మైనింగ్ కేసులో కాకాణిని ఏ–4 నిందితుడిగా చేర్చారు. ఈ నేపథ్యంలో ఆయన్ను నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయానికి విచారణ నిమిత్తం సోమవారం ఉదయం 11 గంటలకు హాజరు కావాలని పొదలకూరు ఎస్‌ఐ హనీఫ్ ఆదివారం నెల్లూరులోని కాకాణి ఇంటికి వెళ్లారు. అయితే ఆయన కుటుంబ సమేతంగా ఉగాది పండగ జరుపుకొనేందుకు హైదరాబాద్ వెళ్లడంతో నోటీసును ఎస్‌ఐ కాకాణి ఇంటి తలుపులకు అంటించి వచ్చారు. కాకాణి హైదరాబాద్‌లో ఉన్నట్లు తెలుసుకున్న పోలీసులు మనుబోలు ఎస్‌ఐ శివరాకేష్‌ను హైదరాబాద్‌కు పంపి కాకాణిని మంగళవారం ఉదయం 11 గంటలకు కేసు విచారణ నిమిత్తం నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయానికి హాజరు కావాల్సిందిగా నోటీసు అందజేసే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో కాకాణి అందుబాటులో లేకపోవడంతో ఇంట్లో దగ్గరి బంధువుకు నోటీసును అందజేశారు. మైనింగ్ కేసులో కాకాణికి ఎలాంటి సంబంధం లేకున్నా ఆయన్ను ఇబ్బందులకు గురి చేయాలనే లక్ష్యంతోనే ఇదంతా చేస్తున్నట్లు విమర్శలకు దిగుతున్నారు.

నేడు హైకోర్టులో విచారణ

మైనింగ్ కేసుకు సంబంధించి కాకాణి ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో మంగళవారం బెయిల్ మంజూరుపై పిటిషన్ విచారణకు రానుంది.

74 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు


- మార్చి 31వ తేదీ అర్ధరాత్రితో ముగిసిన రబీ ధాన్యం కొనుగోలు
- ఏప్రిల్ 1 నుంచి ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభం
- జేసీ కార్తీక్



నెల్లూరురూరల్: జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 74 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జాయింట్ కలెక్టర్ కె కార్తీక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం 3,916 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. సోమవారం అర్ధరాత్రితో రబీ సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగుస్తుందని, మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత యథావిధిగా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన కొనుగోలు ప్రక్రియను ప్రారంభిస్తామని జేసీ తెలిపారు.

పెట్రోల్ కొనుగోలుదారులకు ఐఓసీ టోకరా

- ఓచర్ల రిడీమ్‌లో తిరకాసు
- అడిగిన వారిపై తిట్ల పురాణం



నెల్లూరు (పొగతోట): వినియోగదారులను ఆకర్షించేందుకు ఆయిల్ కంపెనీలు ప్రత్యేక ఆఫర్లను ఇస్తున్నాయి. ఆయా కంపెనీల పెట్రోల్ బంకుల్లో ఆయిల్ పోయించుకున్న వినియోగదారులకు ఓచర్స్ ఆఫర్‌ను ప్రకటిస్తున్నాయి. ఆ ఓచర్‌ను స్క్రాచ్ చేస్తే క్యాష్ బ్యాక్‌గా నగదు ఎంతో కొంత వినియోగదారుడికి క్రెడిట్ అవుతోంది. ఈ క్రమంలో మిగతా కంపెనీలన్నీ ఓచర్ల రిడీమ్ చేస్తుండగా, ఐఓసీ (ఇండియన్ ఆయిల్ కంపెనీ) మాత్రం తిరకాసు పెట్టి కొనుగోలుదారులను దగా చేస్తోంది. ఐఓసీ కూడా ఈ తరహా ఆఫర్‌ను విస్తృతంగా ప్రచారం చేసింది. సోమవారం 3వ మైలులోని ఇండియన్ ఆయిల్ కంపెనీ పెట్రోల్ బంకులో ఒక వినియోగదారుడు తన కారుకు డీజిల్ పట్టించుకున్నారు. రిడీమ్ ఓచర్స్ ఇచ్చారు. అయితే అవి రీడమ్ కాకపోవడంతో ఈ విషయమై సంబంధిత కంపెనీ నెల్లూరు సేల్స్ మేనేజర్ విద్యాసాగర్‌కు వినియోగదారుడు ఫోన్ చేశాడు. వినియోగదారులకు సరైన సమాధానం ఇవ్వకుండా మేనేజర్ నోటికొచ్చినట్లు దుర్భాషలాడారు. కంపెనీ ఆఫర్లు వినియోగించుకున్నప్పటికీ మేలు జరగకపోగా కంపెనీ మేనేజర్ నోటి కొచ్చినట్లు అసభ్య పదజాలంతో దూషించడంతో వినియోగదారుడు మానసిక క్షోభకు గురయ్యారు. ఈ విషయంపై ఐఓసీ కంపెనీ మేనేజర్‌కు ఫిర్యాదు చేశారు. అక్కడ ఉన్న పెట్రోలు బంకు యజమాని సైతం వినియోగదారుడికి అండగా నిలిచి ఓచర్ రిడీమ్ విషయంలో సేల్స్ మేనేజర్ తీరుపై కంపెనీ ప్రతినిధులకు ఫిర్యాదు చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం అయితే తమ వ్యాపారం కూడా దెబ్బతింటుందని సదరు యజమాని ఆవేదన వ్యక్తం చేశారు. వినియోగదారుడిపై దూషణలకు దిగిన సేల్స్ మేనేజర్ విద్యాసాగర్‌పై సంబంధిత కంపెనీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వినియోగదారులతోపాటు డీలర్లు కోరుతున్నారు.

మామిడి రాక.. మరింత ఆలస్యం

మామిడి సీజన్ వస్తే చాలు.. దాని రుచిని ఆస్వాదించాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. కానీ ఈసారి మాత్రం మరికొంత కాలం ఆగాల్సిందే. పూత కొంత రాలడం, పురుగులు సోకడం, భిన్న వాతావరణ పరిస్థితుల వల్ల దిగుబడి తగ్గే అవకాశం ఉందని ఉద్యాన శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

- అనుకూలించని వాతావరణ పరిస్థితులు
- ఇంకా పిందె దశలోనే..
- పంటకు ఈనెల చాలా ముఖ్యం
- పురుగుల నివారణతోనే నాణ్యత
- నష్ట నివారణ చర్యల్లో రైతులు


రైతులకు సూచనలిస్తున్న అధికారులు (ఫైల్)


తామర పురుగు వల్ల దెబ్బతిన్న ఆకులు

ఉలవపాడు: ఫలాల్లో రారాజు మామిడి. వేసవి వచ్చిందంటే చాలు నిగనిగలాడే పండు నోరూరిస్తుంది. సస్యరక్షణ చర్యలతోనే మామిడి రైతు జీవితం ఆధారపడి ఉంది. ప్రధానంగా ఈ పంటకు ఏప్రిల్ నెల చాలా ముఖ్యం. తోటల్ని జాగ్రత్తగా కాపాడుకుంటే దిగుబడి బాగుండి రైతులు సంతోషంగా ఉంటారు. కానీ నేడు పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. మామిడి అంటేనే గుర్తుకొచ్చేది ఉలవపాడు ప్రాంతం. ఉలవపాడు బంగినపల్లికి ఎంతో గుర్తింపు ఉంది. రుచిలో, నాణ్యతలో ఉలవపాడు మామిడి ప్రథమ స్థానంలో ఉంటుంది. అందుకే రైతులు ఉద్యాన శాఖ సలహాలు, సీనియర్ శాస్త్రవేత్తల సూచనలతోపాటు, ఎంతోకాలం నుంచి సాగు చేస్తున్న అనుభవంతో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది వివిధ కారణాలతో ఆశించిన స్థాయిలో పూత రాలేదు. వచ్చిన పూత కూడా కొంత మాడిపోయింది. ప్రస్తుతం పిందె దశకు చేరుకున్న మామిడిని కాపాడుకోవడంపైనే దిగుబడి ఆధారపడి ఉంది. ఇటీవల ఉద్యాన శాఖ, శాస్త్రవేత్తలు పలు మామిడి తోటల్ని పరిశీలించారు. పురుగులు ఆశించినట్లు గుర్తించారు. వాటి నివారణకు చర్యలు తీసుకుంటేనే పంట నాణ్యతగా ఉంటుంది.

పురుగుల నివారణ చాలా ముఖ్యం

ప్రస్తుతం ఉలవపాడు ప్రాంతంలో తోటలకు పలు పురుగులు ఆశించినట్లు ఉద్యాన శాఖ అధికారులు గుర్తించారు. ప్రధానంగా నల్లతామర పురుగులున్నట్లు రైతులు చెబుతున్నారు. వీటి నివారణకు శాస్త్రవేత్తలు సలహాలు తెలియజేస్తున్నారు. ఈనెలలో పిందెలను కాపాడుకునేందుకు రైతులు దృష్టి సారించాలని సూచిస్తున్నారు.


నల్లతామర పురుగు వల్ల దెబ్బతిన్న పూత

జిల్లాలో ఇలా..

ఉలవపాడు ఉద్యాన శాఖ పరిధిలో సుమారు 10 వేల ఎకరాల్లో మామిడి సాగు జరుగుతోంది. ఈ మండల పరిధిలో 7 వేల ఎకరాల్లో పంట ఉంది. అందులో కేవలం బంగినపల్లె రకం 5,500 ఎకరాల్లో ఉన్నట్లు అంచనా. ఇక జిల్లా వ్యాప్తంగా సుమారు 18 వేల ఎకరాల్లో మామిడి సాగు జరుగుతోంది. అన్ని చోట్లా పరిస్థితి అనుకూలంగా లేదని రైతులు అంటున్నారు. లేత తోట అయితే ఎకరాకు సుమారు 2 టన్నులు, పెద్ద తోట అయితే ఎకరాకు 4 నుంచి 5 టన్నుల దిగుబడి ఉంటుంది. సాధారణంగా ఎకరాకు లేత తోటలు, పెద్ద తోటల మధ్య సరాసరిగా 4 నుంచి 5 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. కానీ ఈ ఏడాది నెలకొన్న పరిస్థితులతో దిగుబడి తగ్గుతుందని భావిస్తున్నారు. పిందెల్ని జాగ్రత్తగా కాపాడుకుంటే కొంతమేర దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. దీనికితోడు ఈ ఏడాది కూడా మామిడి ఏప్రిల్ చివరకు వచ్చే అవకాశం ఉంది. గతంలో ఇప్పటికే కాయలు వచ్చేవి. కానీ ఈసారి ఆలస్యమవుతోంది.

అనుకూలించక..

ఈ ఏడాది మామిడి రైతులకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేవు. జనవరిలో కూడా వర్షాలు కురవడం, పొగమంచు ప్రభావం ఇంకా ఉండటంతో పూత ఆశించిన స్థాయిలో నిలబడలేదు. మామిడి పూత మాడిపోయి కొంత రాలిన పరిస్థితులున్నాయి. రైతులు మందులు పిచికారీ చేసి పూత ఎక్కువ శాతం రాలకుండా కాపాడుకున్నారు. కొన్ని తోటల్లో మాత్రం పూత ఆలస్యంగా రావడం, వాటిని కాపాడలేని పరిస్థితులు వచ్చాయి. ముందు వచ్చిన పూత మాత్రం పిందె దశకు చేరుకుంది. అవి రాలకుండా ఉండటానికి మరలా నీటి తడిని ఇస్తున్నారు. మొత్తంగా ఎనిమిదేళ్లుగా భిన్న వాతావరణ పరిస్థితులు మామిడి రైతులను ఇబ్బంది పెడుతున్నాయి.

వాతావరణం అనుకూలంగా లేదు



మామిడి సాగుకు వాతావరణం అనుకూలంగా లేదు. పూత మాడి రాలిపోతోంది. మందులు పిచికారీ చేసి కాపాడుకుంటున్నాం. పిందెలు వచ్చాయి. జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– గోపాల్‌రెడ్డి, మామిడి రైతు, ఉలవపాడు

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మామిడి రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. శాస్త్రవేత్తలతో సలహాలు ఇప్పించాం. నష్ట నివారణ చర్యలు చేపట్టడానికి రైతులకు ఉద్యాన శాఖ, సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ఎలాంటి సమస్య అయినా మా దృష్టికి తీసుకురావాలి.

– జ్యోతి, ఉద్యాన శాఖాధికారి, ఉలవపాడు

నెల్లూరు బారాషహీద్ దర్గా వద్ద జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



మదినిండా భక్తితో..

ముస్లింలు అతి పవిత్రంగా భావించే ఈద్ – ఉల్ – ఫితర్‌ను సోమవారం జిల్లా వ్యాప్తంగా అత్యంత వైభవంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మసీదులను శోభాయమానంగా అలంకరించారు. నెల్లూరులోని మసీదులు, ఈద్గాల వద్ద పెద్దఎత్తున ప్రార్థనలు జరిగాయి. రంజాన్ ఉపవాసాల ద్వారా నేర్చుకున్న నియమ, నిబంధనలను జీవితాంతం పాటించాలని మతపెద్దలు సందేశాన్నిచ్చారు.

– నెల్లూరు(బృందావనం)



రెచ్చిపోయిన టీడీపీ శ్రేణులు

- ఇంటి స్థలంపై వివాదం
- వైఎస్సార్‌సీపీకి చెందిన వారిపై దాడి
- కేసు నమోదు చేయని పోలీసులు

కావలి: దగదర్తి మండలం ఉలవపాళ్ల గ్రామంలో ఇంటి స్థలం విషయంలో ఇరు కుటుంబాల మధ్య వివాదం చెలరేగింది. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో టీడీపీకి చెందిన వారు కర్రలు, ఇనుప రాడ్‌లతో దాడి చేయడంతో వైఎస్సార్‌సీపీకి చెందిన ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఓ మహిళకు తల పగిలి కుట్లు పడ్డాయి. ఇంత జరిగినా పోలీసులు కేసు నమోదు చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్థానికులు, బాధితుల కథనం మేరకు.. ఉలవపాళ్లలో వైఎస్సార్‌సీపీకి చెందిన తిరుపతి వెంకటేశ్వర్లుకు, టీడీపీకి చెందిన తిరుపతి మల్లికార్జున మధ్య కొంత కాలంగా ఇంటి స్థలం సరిహద్దులకు సంబంధించిన వివాదం నడుస్తోంది. అధికారం ఉండటంతో మల్లికార్జున తరచూ వెంకటేశ్వర్లుతో గొడవ పడేవాడు. ఈక్రమంలో గత నెల 25వ తేదీన పెద్దలు ఇరువర్గాలతో మాట్లాడి స్థలం కొలత వేయించి అది వెంకటేశ్వర్లుకే చెందుతుందని చెప్పారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేకపోయిన మల్లికార్జున తన భార్య నాగలక్ష్మి, కొడుకుతో కలిసి వెంకటేశ్వర్లు కుటుంబంపై రాళ్లు, కర్రలతో దాడికి దిగాడు. వెంకటేశ్వర్లు భార్య మునెమ్మ, కుమార్తె రాజేశ్వరి, కుమారుడు మురళీని తీవ్రంగా గాయపరిచారు. రాజేశ్వరి తలకు తీవ్రగాయం కావడంతో కావలి ఏరియా ఆస్పత్రిలో 11 కుట్లు కూడా వేశారు. ఈ ఘటనపై మురళి దగదర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే పోలీసులు అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు తప్ప కేసు నమోదు చేయలేదు. టీడీపీ నాయకుల ఒత్తిడితో కేసు నమోదు చేయడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

కండలేరులో 48.664 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 48.664 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 1,320, పిన్నేరు కాలువకు 5, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నెల్లూరు(క్రైమ్): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని మహిళ మృతిచెందిన ఘటనపై నెల్లూరు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. చాణుక్యపురికాలనీ పరిసర ప్రాంతాల్లో గుర్తుతెలియని మహిళ (35) కొంతకాలంగా భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. రాత్రి వేళల్లో ఆమె దుకాణాల బయట నిద్రించేది. గత నెల 12వ తేదీన కాలనీలోని మసీదు సమీపంలో అపస్మారక స్థితిలో పడి ఉండటంతో స్థానికులు గమనించి వీఆర్వో ప్రసాద్‌కు సమాచారం అందించారు. ఆయన ఘటనా స్థలానికి చేరుకుని ఆమెను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మహిళ మృతిచెందింది. ఈ మేరకు సోమవారం ప్రసాద్ వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

- వృద్ధుడి దుర్మరణం

కావలి: కావలి పట్టణంలోని మద్దూరుపాడు వద్ద జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని వెంకటసుబ్బయ్య (68) అనే వృద్ధుడు మృతి చెందాడు. ఒంగోలు వైపు వెళ్లే రోడ్డులో మద్దూరుపాడులోని సర్వాయపాళెం క్రాసింగ్ రోడ్డు సమీపంలో జరిగిన ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కావలి రూరల్ పోలీస్ స్టేషన్ సీఐ జి.రాజేశ్వరరావు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సైదాపురం(కలువాయి): మండలంలోని తోపుగుంటలో సోమవారం మోటార్‌బైక్ అదుపు తప్పి ఇద్దరు యువకులు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. చీపినాపి ఎస్సీ కాలనీకి చెందిన గణేష్, కల్యాణ్ మోటార్‌బైక్‌పై తోపుగుంట వైపు వెళ్తున్నారు. ఉన్నట్టుండి గేదె అడ్డం రావడంతో బైక్ అదుపు తప్పింది. గాయపడిన ఇద్దరు యువకులను స్థానికులు ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.100
సన్నవి : రూ.70
పండ్లు : రూ.40



సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం


నూతన కార్యవర్గ సభ్యులు

నెల్లూరు(టౌన్): దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పలువురు వక్తలు తెలిపారు. శారీరక దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నెల్లూరు దర్గామిట్ట క్రాంతినగర్‌లోని మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా కోదండరామయ్య (విద్యాశాఖ), అధ్యక్షుడిగా వడగండ్ల నాగమణి (మున్సిపల్), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పెంచలయ్య (విద్యాశాఖ), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎస్‌కే రియాజ్ (విద్యాశాఖ), ప్రధాన కార్యదర్శిగా ఎంపీ నరసింహులు (విద్యాశాఖ), అదనపు ప్రధాన కార్యదర్శులుగా బాలసుబ్రహ్మణ్యం (సమగ్రశిక్ష), మృదుల (విద్యాశాఖ), కోశాధికారిగా ఎ.హరి (విద్యాశాఖ) నియమితులయ్యారు. అదే విధంగా జిల్లా మహిళా విభాగం కార్యదర్శులుగా పి.విజయలక్ష్మి (విద్యుత్), సుభద్ర (ఫుడ్), రాధిక (సచివాలయాలు), ప్రచార కార్యదర్శులుగా జి.రవి (విద్యాశాఖ) సురేష్ (విద్యాశాఖ)లు ఎంపికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా సంఘం రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు, నాగేంద్రబాబు వ్యవహరించారు. బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మద్దతు ప్రకటించారు. సంక్షేమ సంఘం, వైఎస్సార్ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి జేమ్స్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణ పాల్గొన్నారు.

అఖిల భారత రైతు కూలీ సంఘం నిరసన



ఆందోళన చేస్తున్న సంఘం నేతలు తదితరులు

సైదాపురం: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజా సంపదను కార్పొరేట్‌కు అప్పగించేందుకు కుట్రలు చేస్తోందని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ డీపీ పోలయ్య ఆరోపించారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ సోమవారం సైదాపురం బస్టాండ్‌లో సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను హరిస్తోందన్నారు. దేశంలో 70 శాతం మంది ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నేతలు పందిటి వెంకటయ్య, చెంగల్‌రావు, మమత, అనూష, నాగమణి, కోటయ్య, శ్రీను, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బంగారు దుకాణానికి తాళం వేస్తుండగా..

- నగదు, నగలున్న బ్యాగ్ చోరీ
- ఆత్మకూరులో ఘటన

ఆత్మకూరు: పట్టణంలోని మెయిన్ బజార్‌లో ఓ వ్యక్తి తన బంగారు నగల దుకాణాన్ని మూసి తాళం వేస్తున్నాడు. ఈ సమయంలో నగలు, నగదు ఉన్న బ్యాగ్‌ను పక్కనపెట్టి ఉండగా ఇద్దరు యువకులు దానిని చోరీ చేసి మోటార్‌బైక్‌పై పరారయ్యారు. ఈ ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. దుకాణదారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలిలా ఉన్నాయి. రమణమూర్తి అనే వ్యక్తి మెయిన్ బజార్‌లో ప్రియదర్శిని నగర్ సమీపంలో బంగారు నగల దుకాణం నిర్వహిస్తున్నాడు. రాత్రి షాపు మూసేందుకు బయటికి వచ్చాడు. చేతిలోని బ్యాగ్‌లో 60 గ్రాముల బంగారు వస్తువులు, 4 కేజీల వెండి వస్తువులు, సుమారు రూ.15 వేల నగదు ఉన్నాయి. దానిని పక్కనే ఉన్న చిన్న గోడపై పెట్టి దుకాణానికి తాళం వేస్తుండగా గుర్తుతెలియని ఓ యువకుడు బ్యాగ్‌ను చోరీ చేశాడు. అప్పటికే రోడ్డుపై బైక్ స్టార్ట్ చేసి ఉన్న మరో యువకుడితో కలిసి ఉడాయించారు. రమణమూర్తి గమనించి కేకలు వేయడంతో సమీపంలో యువకులు బైక్‌లపై వారిని వెంబడించారు. అయినా వారు తప్పించుకుని వెళ్లిపోయారు. ట్రాఫిక్ కారణంగా వెంబడించిన యువకులు ఉసూరుమంటూ వెనక్కి వచ్చారు. బాధితుడు సీఐ జి గంగాధర్, ఎస్సై బి.సాయిప్రసాద్‌కు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీ టీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేశామని, పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తామని సీఐ తెలిపారు.


బాధితుడు రమణమూర్తి

నిమ్మ రైతులకు నిరాశ


నిమ్మకాయల్ని గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

సైదాపురం: నిమ్మ ధరలు ఆశించిన మేర లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏటా మార్చి నెలాఖరుకు ధరలు పెరిగి కొంత మేర లాభాలు వచ్చేవి. ప్రస్తుతం దిగుబడి పెరిగినా ఢిల్లీ మార్కెట్లో ధరల్లేవని వ్యాపారులు చెబుతున్నారు. 50 కేజీల బస్తా కాయలు రూ.4,500 నుంచి రూ.6 వేల వరకు ఉంది. నాణ్యత కలిగిన కాయలకు సైతం ధరలు లేకపోవడంతో ఖర్చులు పోనూ పెద్దగా ఆదాయం రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

నీటి సంపులో మృతదేహం

- హత్య చేసి అందులో పడేశారా?
- ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడా?
- విచారణ చేపట్టిన పోలీసులు

నెల్లూరు సిటీ: పాఠశాల ఆవరణలోని నీటి సంపులో మృతదేహం తేలియాడుతుండగా సోమవారం స్థానికులు గుర్తించారు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలంలోని దేవరపాళెం గ్రామానికి చెందిన మాచనూరు శేషయ్య (48) బేల్దారి పని చేస్తుంటాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. గత నెల 27వ తేదీ నుంచి శేషయ్య ఇంటికి రాలేదు. ఎక్కడికి వెళ్లాడో తెలియక కుటుంబ సభ్యులు సమీపంలోని ప్రాంతాల్లో వెతికారు. బంధువులకు ఫోన్ చేసి కనుక్కోగా రాలేదని చెప్పారు. ఈ క్రమంలో దేవరపాళెంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉన్న నీటి సంపు నుంచి దుర్వాసన రావడాన్ని సోమవారం స్థానికులు గుర్తించారు. అక్కడికి వెళ్లి చూడగా నీటిలో ఉబ్బిపోయి గుర్తుపట్టలేని స్థితిలో మృతదేహం ఉంది. వెంటనే రూరల్ పోలీసులకు సమాచారమిచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. క్లూస్‌టీంను పిలిపించగా వారు సాంకేతిక ఆధారాలు సేకరించారు. దుస్తుల ఆధారంగా స్థానికులు శేషయ్యగా నిర్ధారించారు.


శేషయ్య (ఫైల్)

ఏం జరిగిందో..

సంపులో మృతదేహం బయటపడటంతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. బేల్దారి పనులు చేసుకుంటున్న శేషయ్య మృతిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హత్య చేసి మృతదేహాన్ని సంపులో పడేశారా?, లేక ప్రమాదవశాత్తు పడిపోయి చనిపోయాడా? అనే కోణాల్లో విచారణ చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పాస్టర్ మృతిపై విచారణకు డిమాండ్



ర్యాలీ చేస్తున్న పాస్టర్లు

సైదాపురం(కలువాయి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ చేయాలని డిస్ట్రిక్ట్ పాస్టర్స్ ఫెలోషిప్ నేతలు డిమాండ్ చేశారు. వారు సోమవారం కలువాయి బస్టాండ్‌లో శాంతియుతంగా నిరసన తెలిపారు. అంతకుముందు ర్యాలీ చేపట్టారు. పాస్టర్ ఆనంద్ మాట్లాడుతూ ప్రవీణ్‌ను కొందరు దుండగులు హత్య చేసి ప్రమాదంలో మృతిచెందినట్టు చిత్రీకరించారని ఆరోపించారు. ప్రభుత్వం విచారణ చేయించి నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్లు సంపత్‌కుమార్, జాన్ భాస్కర్, రవి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 142
లేయర్ (లైవ్)	: 95
బ్రాయిలర్ చికెన్	: 256
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 282
లేయర్ చికెన్	: 162

